క్లుప్తంగా

26న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్

ఈపూరు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) పల్నాడు జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశంలో ఈ నెల 26వ తేదీ నిర్వహించనున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు బి.భాస్కరరావు, ప్రధానకార్యదర్శి ఎస్కే యాకుబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేటలోని కొత్త రఘురామయ్య కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించనున్న సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యా సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

యడ్లపాడు: స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఉచిత బీపీ షుగర్ వైద్యశిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిబిరంలో సీనియర్ వైద్యులు లింగమల్ల మోహన్ భాస్కర్, కందుల రంగారావు, నూతలపాటి షణ్ముఖం, జి.సుమ పాల్గొని వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

పది తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు

వినుకొండ(నూజెండ్ల): పదో తరగతి విద్యార్థులు ఎటువంటి ఆందోళనలు, ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు తెలిపారు. నూజెండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్కే జిలానీబాషా, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎస్. అన్నపూర్ణమ్మ, పీఎంసీ చైర్మన్ వంగూరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ తిరునాళ్ల

ఈపూరు: మండలంలోని బొగ్గరంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ తిరునాళ్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొగ్గరంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు భారీ సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకొని మహిళలు పొంగుబాలు నిర్వహించారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ వెంకట్రావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రీడల్లో రాణించడం అభినందనీయం




చిలకలూరిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించటం అభినందనీయమని మురికిపూడి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జీఎస్ కరిముల్లా చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని చౌదరయ్య స్కూల్‌లో ఇటీవల నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మురికిపూడి జెడ్పీ హైస్కూల్ బాలికల జట్టు ద్వితీయ బహుమతి సాధించింది. బహుమతి సాధించిన జట్టుకు పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ పీడీ ఎస్కే అచ్చేమియా, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రసూల్, కవిత, మాధవి పాల్గొన్నారు.

కల్తీ లేకుండా ఆహార పదార్థాలు తయారు చేయండి

రొంపిచర్ల: ఆహార పదార్థాల తయారీలో కల్తీ లేకుండా చూడాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలోని బేకరీలను, స్వీట్ షాప్‌లను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ మేరకు బేకరీ, స్వీట్ షాప్‌ల నిర్వాహకులకు ఆయన తాకీదులు అందజేశారు. ఆహార పదార్థాల తయారీలో రంగును తగు మోతాదులో వాడాలన్నారు. అలాగే నూనెలను కూడా ఒకసారి ఉపయోగించిన నూనెను తిరిగి ఉపయోగించవద్దు అని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి తినుబండారాలు తయారు చేస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

చేయూత, ఆసరా ద్వారా జీవనోపాధి



నకరికల్లు: మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలు తోడ్పాటుగా నిలుస్తున్నాయని డీఆర్‌డీఏ పీడీ బి.బాలూనాయక్ చెప్పారు. మండల సమాఖ్య పరిధిలోని వీఓఏలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రికార్డులు తనిఖీచేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఫ్లిప్‌కార్ట్ ద్వారా విక్రయించేందుకు ప్రభుత్వ సహకారంతో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో శ్రీనిధి ఏపీఎం చెన్నకేశవులు, ఏపీఎం సునీత పాల్గొన్నారు.

ఈనాడు తప్పుడు రాతలపై ఆగ్రహం



వినుకొండలో ఈనాడు పేపర్లను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చిలకలూరిపేటలో.. ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తల నిరసన ర్యాలీ
- ఈనాడు ప్రతుల దహనం

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వంపై ఈనాడు తప్పుడు కథనాలపై ఆగ్రహం పెల్లుబికుతోంది. నిరసనగా ర్యాలీలు నిర్వహించారు. ఈనాడు ప్రతులను దహనం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పీఎస్ ఖాన్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. శివయ్య స్థూపం సెంటర్ వద్దకు ర్యాలీ సాగింది. ఈనాడు పేపరును, రామోజీరావు చిత్రపటాలను దహణం చేసి అసత్య వ్యాఖ్యలు చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఎస్ ఖాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలపై వ్యతిరేకంగా విషం చిమ్ముతూ ఈనాడు రామోజీరావు తప్పుడు రాతలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధి చేస్తుంటే ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. ఈనాడు రామోజీరావు తప్పుడు రాతలు, అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వినుకొండ సొసైటీ చైర్మన్ అనుమోలు నాసరరెడ్డి, మైనార్టీ నాయకులు మస్తాన్‌వలి, వార్డు కౌన్సిలర్లు పాపసాని బ్రహ్మయ్య, నంది నరసింహారావు, యారం రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వానికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

చిలకలూరిపేట: తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న ఈనాడు యాజమాన్యం ప్రభుత్వానికి, ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు పాల్పడుతున్న ఈనాడు పత్రిక వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఈనాడు పత్రిక ప్రతులను శుక్రవారం దహనం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై, ప్రభుత్వంపై అనునిత్యం దుష్ప్రచారం పాత ఫొటోలను అచ్చువేయించిన రామోజీరావు దొంగలా దొరికిపోయాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అల్లీమియా, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, 15వ ఆర్థిక సంఘం సభ్యుడు వడితే కోట్యానాయక్, కొమరవల్లిపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు తోట బ్రహ్మస్వాములు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు సయ్యద్ సిరాజ్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- బిలాల్ మసీదుకు రూ.2లక్షల సాయం



మసీదు పెద్దలకు రూ.2లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బిలాల్ మసీదు అభివృద్ధికి ప్రకటించిన రూ.5లక్షల్లో తొలి విడత రూ.2లక్షలు శుక్రవారం అందజేశారు. ప్రకాష్‌నగర్ 12వ వార్డులోని షాలెంనగర్‌లోని బిలాల్ మసీదును సందర్శించి ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా వారినుద్దేశించి మాట్లాడుతూ 29 మసీదుల్లోని 53 మంది ఇమామ్, మౌజమ్‌లకు ప్రభుత్వం గౌరవ వేతనం, ఇళ్లపట్టాలు అందజేశామన్నారు. పట్టణంలో మూడు మసీదుల నిర్మాణం చేపట్టామన్నారు. వరవకట్టలోని జామియా మసీదును షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి సారథ్యంలో వచ్చే రంజాన్ మాసం నాటికి పూర్తి చేసి నమాజ్ చేసేందుకు అందజేస్తామన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న మసీదు అన్నీ అనుమతులు ఇప్పించి త్వరలో ప్రారంభిస్తామని, ఒకటో వార్డులో మసీదు నిర్మాణానికి స్థలం కేటాయించటం జరిగిందని, నిర్మాణం ప్రారంభం చేస్తామన్నారు. మసీదుల్లో ఉన్న మౌలిక సదుపాయాల కోసం పెద్ద మసీదుకు రూ.5లక్షలు ఇస్తానని మాట ఇచ్చానన్నారు. ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక కోటి కేటాయించిందని, అయితే ఇంకా నిధుల విడుదల కానందున తాను సొంతంగా పనుల ప్రారంభానికి రూ.2లక్షలు కేటాయించి అందజేస్తున్నామని వివరించారు. మరో 15రోజుల్లో మిగతా రూ.3లక్షలు అందజేస్తామన్నారు. హాజ్ యాత్రకు వెళ్లేవారు ఏపీలోని గన్నవరం విమానాశ్రయం నుంచి వెళ్లవచ్చన్నారు.

షాదీతోఫా పదో తరగతి నిబంధన తొలగించాలని ప్రభుత్వానికి విన్నవించామని, అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, పట్టణ ముస్లిం మైనార్టీసెల్ అధ్యక్షులు షేక్ మహబూబు బాషా, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గంటెనపాటి గాబ్రియేలు, మాజీ కౌన్సిలర్ నెలటూరి మురళి, నాయకులు సానికొమ్ము కోటిరెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జేకే కరిముల్లా, షేక్ జిలాని పాల్గొన్నారు.

చోరీ చోటుచేసుకున్న గంటల్లోనే..

- నిందితుడి అరెస్టు
- 34 సవర్ల బంగారం రికవరీ

నాదెండ్ల: చోరీ ఘటన చోటుచేసుకున్న కొన్ని గంటల వ్యవధిలోనే పోలీసులు కేసును ఛేదించారు. ఎస్ఐ ఆవుల భాస్కర్ తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా అప్పాపురం గ్రామానికి చెందిన రైతు నాగుబడి సాంబశివరావు గురువారం ఉదయం భార్యతో కలసి పొలం పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇదే రైతు వద్ద నిత్యం పొలం పనులకు వెళ్లే కొల్లూరు తిరుపతిరావు గురువారం పనికి వెళ్లలేదు. ఉదయం వెళ్లిన దంపతులు సాయంత్రం 6 గంటలకు ఇంటికి చేరుకునే సరికి 34 సవర్ల బంగారం నగలు చోరీకి గురైనట్లు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. చోరీ సొత్తు విలువ రూ.12.24 లక్షలుగా పేర్కొన్నారు. రైతు సాంబశివరావు కుటుంబ సభ్యులతో పొలానికి వెళ్లినట్లు గుర్తించిన తిరుపతిరావు మధ్యాహ్నం సమయంలో ఇంటి వెనుక వైపు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 34 సవర్ల బంగారం చోరీ చేశాడు. సమాచారం అందుకున్న నరసరావుపేట డీఎస్పీ విజయభాస్కరరావు, రూరల్ సీఐ వై.అచ్చయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదుచేసుకున్నారు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో గుంటూరు క్లూస్ టీం బృందం పరిశీలించి వివరాలు అందజేయగా, కొల్లూరు శ్రీనివాసరావుపై అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. వేలిముద్రలు పరిశీలించి చోరీ చేసింది శ్రీనివాసరావుగా గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మిషన్ శుభాకృత్ విజయవంతం చేయండి



మోడల్ స్కూల్‌ను పరిశీలిస్తున్న బొల్లాపల్లి మండల ప్రత్యేకాధికారి ఓబులునాయుడు

శావల్యాపురం: ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మిషన్ శుభాకృత్ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా షెడ్యూల్ తెగల వెల్ఫేర్ అధికారి లోతేటి వరలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ శుభాకృత్ కార్యక్రమంపై మండల స్థాయి అధికారుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. అనంతరం మండలంలోని పోట్లూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న ఫర్నీచర్, పేపరు వ్యర్థాలను, ఇనుప వస్తువులన్నీ మండల స్థాయిలో సేకరించి ఈనెల 28న బహిరంగ వేలం పాట నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇటీవల నిరుపయోగంగా పేపరు ఇతర సామగ్రి అమ్మగా రూ.15వేలు వచ్చినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. అలాగే స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నిరుయోగంగా ఉన్న జనరేటరును బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మర్రి విజయ్‌భాస్కరరావు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో..

బొల్లాపల్లి: ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండాలని సోషల్ వెల్ఫేర్ జిల్లా డెప్యూటీ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి ఎస్.ఓబులునాయుడు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.పార్వతి, ఇన్‌చార్జి ఎంఈఓ వై.ఏసుబాబు పాల్గొన్నారు.

పశువైద్యశాలలో..

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల పశు వైద్యశాలలో శుక్రవారం మండల స్థాయి అధికారులు మిషన్ శోభాకృత్ కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి బీజే బెన్ని, ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుసేన్, ఎంఈఓ ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ రామకృష్ణనాయక్, మండల పశువైద్యాధికారి ఏడుకొండలు పశు వైద్యశాలలో ఉన్న నిరుపయోగంగా ఉన్న వస్తువులను గుర్తించి జాబితా రూపొందించారు.

మార్చిన ఒకటిన గ్రామీణ బ్యాంకు శాఖ ప్రారంభం



నూతన బ్యాంకు శాఖ ఏర్పాట్లుపై సూచనలు చేస్తున్న రీజనల్ మేనేజరు మారుతీరామ్

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో మార్చి 1వ తేదీన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు నూతన బ్యాంకు శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా బ్యాంకు మేనేజరు కావూరి సాయిచంద్ర చౌదరి శుక్రవారం ఏర్పాట్లు పరిశీలించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా నరసరావుపేట రీజనల్ బ్యాంకు మేనేజరు(ఆర్ఎం) మారుతీరామ్ హాజరై మాట్లాడుతూ నూతన బ్యాంకు శాఖకు సంబంధించిన ఏర్పాట్లుపై పర్యవేక్షణ చేసి అధికారులకు సూచనలు చేశారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సేవల గురించి ప్రజాప్రతినిధులకు ప్రజలకు వివరించారు. మండలంలోని వయ్యకల్లు, గుంటుపాలెం, భాస్కర్‌నగర్, కారుమంచి గ్రామాల్లో బ్యాంకు సిబ్బంది పర్యటించి కరపత్రాలు ద్వారా పంపిణీ నిర్వహించటంతో పాటు బ్యాంకు సేవలను ప్రజలకు వివరించాలన్నారు. ఆయనతో పాటు రీజనల్ బ్యాంకు కార్యాలయ అధికారులు చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, సాయి సునీల్, శావల్యాపురం బ్యాంకు శాఖ అధికారి ప్రదీప్ ఉన్నారు.

టిడ్కో గృహాల లబ్ధిదారులు వెంటనే చేరాలి

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



టిడ్కో గృహ సముదాయంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఏఎంసీ చైర్మన్ తోట

చిలకలూరిపేట: టిడ్కో గృహాల లబ్ధిదారులు వారికి కేటాయించిన గృహాల్లో వెంటనే చేరాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కోరారు. అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి టిడ్కో గృహ సముదాయాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ 4వేల ఇళ్లను సిద్ధం చేయడం జరిగిందన్నారు. 800 పైచిలుకు వారికి తాళాలు అప్పగిస్తే ఇప్పటికి కేవలం సుమారు వంద మంది మాత్రమే గృహాల్లో నివాసం ఉంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి అయిన లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేయాలని చెప్పారు. మెప్మా సిబ్బంది ఫోన్ చేసిన వెంటనే లబ్ధిదారులు తమ పేరున రిజిస్టర్ అయిన ప్లాట్‌కు సొంత తాళాలు వేసుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకూ విద్యుత్ కనెక్షన్ పొందని వారి కోసం విద్యుత్ అధికారులు గృహ సముదాయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారని చెప్పారు. సబ్సిడీపై కేవలం రూ.450కు విద్యుత్ మీటర్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, 15వ ఆర్థిక సంఘం సభ్యుడు వి కోట్యానాయక్, మున్సిపల్ ఏఈఈ ఎ శ్రీనివాసరావు, టిడ్కో ఏఈఈ దాదావలి పాల్గొన్నారు.

వలంటీర్ ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: గ్రామవలంటీర్ ఖాళీలను భర్తీచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. చాగల్లు–బీసీ 1, చల్లగుండ్ల – బీసీ 1, దేచవరం–ఓసీ 1, గుండ్లపల్లి– బీసీ 1, నకరికల్లు– ఎస్టీ– 2, బీసీ–2 మొత్తం 8 వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశామని పేర్కొన్నారు. పదోతరగతి విద్యార్హత కలిగి 2022 జనవరి 1 నాటికి 18 నుంచి 35ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఈనెల 24 నుంచి మార్చి 2 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మార్చి 3, 4వ తేదీలలో దరఖాస్తులు పరిశీలించి మార్చి 5న మౌఖిక పరీక్ష ఉంటుందని వెల్లడించారు. 6న ఎంపిక వివరాలు తెలియజేసి 7న శిక్షణనిస్తామని వివరించారు. మార్చి 8 నుంచి ఎంపికైన వలంటీర్లు విధులకు హాజరు కావాలని సూచించారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్లాన్లు ఇప్పిస్తే చర్యలు



వినతిపత్రం అందజేస్తున్న టెక్నికల్ లైసెన్స్ పర్సన్ అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట: మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు ప్లానుల అనుమతులు ఇప్పిస్తుంటే వారిని సంఘం నుంచి తప్పిస్తామని నరసరావుపేట లైసెన్స్‌డు ఇంజినీర్స్ అండ్ సర్వేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మసాని కమలాకరరెడ్డి అధికారులకు హామీ ఇచ్చారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరంలో లైసెన్స్‌డ్ ఇంజినీర్లు ప్లాన్‌లు ఇప్పించటంలో తామెదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో టీపీఓ నరసింహారావు, టీపీఎస్‌లు అనూరాధ, రఘురాం, టౌన్ సర్వేయర్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల ఘనత సీఎం వైఎస్ జగన్‌దే

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): దేశంలో ఎక్కడా లేనివిధంగా అన్నీ రాష్ట్రాలకు ఆదర్శంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లీనిక్‌లు నిర్మిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ రూరల్ మండలం నరగాయపాలెంలో రూ.40 లక్షల నిధులతో గ్రామ సచివాలయం, రూ.17.5 లక్షల నిధులతో విలేజ్ క్లీ రూ.21.80 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే భవనాలను ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ పగడాల జయశ్రీవెంకట్రామిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా పరిపాలనను ప్రజలకు చేరువ చేసేందు గ్రామ సచివాలయాలు నిర్మించినట్లు చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా వైద్యసేవలు అందించేందుకు విలేజ్ క్లీనిక్‌లు నిర్మించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు, గ్రామసచివాలయ వ్యవస్థ పక్క రాష్ట్రాల వారు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు అండ్ కో గ్రామాల్లో అలజడులు సృష్టించి రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్నారని ఆరోపించారు. ఎల్లో మీడియా ద్వారా అసత్య ప్రచారాలకు పూనుకున్నారని దుయ్యబట్టారు. వినుకొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పనికట్టుకొని కోర్టుల్లో కేసులు వేయిస్తున్నారని అన్నారు. నరగాయపాలెం గ్రామంలోనే రూ.78లక్షలకు పైగా నిధులతో నూతన భవనాల ఏర్పాటుతో పాటు పాత నరగాయపాలెం నుంచి నూతన రోడ్డు నిర్మాణం చేపట్టిన ఘనత తమదేనని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి వజ్రాల నాగిరెడ్డి, ఎంపీటీసీ మాలపాటి కోటిరెడ్డి, వినుకొండ సొసైటీ చైర్మన్ అనుమోలు నాసరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు విజయలక్ష్మి రాజా, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డితో పాటు దండు చెన్నయ్య, సుబ్బారెడ్డి, కంచర్ల గురునాథం, రవి, భవనం తాతిరెడ్డి పాల్గొన్నారు.

రీసర్వే పనులు పూర్తి చేయండి

ఆర్డీఓ మల్రెడ్డి శేషిరెడ్డి



పిచికలపాలెం రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనుల్లో రైతుతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

శావల్యాపురం: రీసర్వే పనులు వేగవంతం చేయాలని ఆర్డీఓ మల్రెడ్డి శేషిరెడ్డి ఆదేశించారు. మండలంలోని పిచికలపాలెం రెవెన్యూ గ్రామంలో చేపట్టిన రీసర్వే పనులను శుక్రవారం పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ నరసరావుపేట డివిజన్ పరిధిలో 36 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటి వరకు 25 వేల 500 మంది రైతులకు భూహక్కు పత్రాలు సిద్ధం చేయగా 80 శాతం పూర్తి అయిందన్నారు. రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు వినుకొండ– 5, నూజెండ్ల– 3, ఈపూరు మండలం వనికుంట రెవెన్యూ గ్రామాల్లోని రైతులకు భూహక్కు పత్రాలను అందజేశామన్నారు. మార్చి 15వ తేదీ నాటికి శావల్యాపురం మండలంలో కనమర్లపూడి, పోట్లూరు, వేల్పూరు, శానంపూడి, పిచికలపాలెం రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని కోరారు. ఆయనతో పాటు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, మండల డిప్యూటి సర్వేయర్ తుంగా శ్రీనివారావు, సచివాలయ సర్వేయర్లు ఉన్నారు.

కొండ్రముట్లలో..

ఈపూరు: మండలంలోని కొండ్రముట్ల గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను స్థానిక తహసీల్దార్ రామావత్ వెంకటేశ్వర్లు నాయక్‌తో కలసి ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి పరిశీలించారు. ఆయన వెంట సర్వేయర్ చండీరాణి ఉన్నారు.

ఎమ్మెల్యే బొల్లాకు సన్మానం



ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, కౌన్సిలర్లు

వినుకొండ(నూజెండ్ల): ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల, షాదీఖానా నిర్మాణాలకు సంబంధించి అవసరమైన స్థలాన్ని కేటాయించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు నియోజకవర్గ ముస్లింలు తరపున మున్సిపల్ చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల వినుకొండ పర్యటన సందర్భంగా నియోజకవర్గ ముస్లింలకు ఇచ్చిన మాట ప్రకారం ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల, షాదీఖానా నిర్మాణాలకు పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీలోని ప్రభుత్వ స్థలం 7.50 ఎకరాల భూమిని కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ షకీలా, నన్నేసా, గంటా కాలేషా పాల్గొన్నారు.

సబ్‌జైలును పరిశీలించిన జడ్జి తౌషిద్‌హుసేన్



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి ఎ.తౌషిద్‌హుస్సేన్

వినుకొండ(నూజెండ్ల): స్థానిక సబ్ జైలును వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్‌హుసేన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఖైదీలతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు, ఆరోగ్య పరిస్థితులు, వైద్యం, భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని సూచించారు. విడుదల అయిన తరువాత ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, నేరాలకు దూరంగా ఉండాలని, సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని సూచించారు. భవిష్యత్‌లో నేరాల జోలికి పోవద్దని చెప్పారు. వంటగది, స్టోర్ రూమ్, ఆహార పదార్థాలను తనిఖీ చేసి సూచనలు చేశారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారికి న్యాయవాదిని నియమిస్తామని, ఎవరికైనా న్యాయసలహాలు కావాలంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఆరె సామ్రాజ్యం, పి.వి.రమణారెడ్డి, కె.చెన్నకేశవరెడ్డి, పి.గౌస్‌మొహిద్దీన్‌ఖాన్, ఎం.శ్రీనివాసరావు, వి.శివశంకర్‌బాబు, సీహెచ్. బ్రహ్మం, పోలీసులు, జైలు సూపరింటెండెంట్ మధుసూదనరావు పాల్గొన్నారు.

కనుల పండువలా కోదండరాముడి కల్యాణం

నేడు గ్రామోత్సవం, అన్నదానం

నాదెండ్ల: స్థానిక శంభునిపాలెంలోని కోదండరామస్వామి దేవస్థాన వార్షికోత్సవ అష్టబంధ మహా మహాసంప్రోక్షణ వేడుకల్లో భాగంగా శుక్రవారం స్వామివార్లకు కల్యాణం నిర్వహించారు. హనుమత్‌సీత లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవ విగ్రహాలను రాత్రి 7.30 గంటలకు నూతన వస్త్రాలతో అలంకరించారు. సీతా సమేత కోదండరామస్వామిని పీటలపై కూర్చోబెట్టి సంప్రదాయ బద్ధ మేళతాళాలతో తలంబ్రాలు వేసి మాంగల్యాధారణ గావించారు. ఆలయ అర్చకుడు పరాంకుశం విజయరామాచార్యులు బృందం ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలకు శనివారం ఉదయం గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయం ముందు వేసిన చలువ పందిరిలో మహాహోమం, శాంతి హోమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ధర్మకర్త నల్లమోతు పుల్లారావు, కార్యదర్శి వెంకట్రావు పర్యవేక్షించారు.

మార్చి 1న మండల సర్వసభ్య సమావేశం

ఈపూరు: మండల సర్వసభ్య సమావేశం మార్చి ఒకటో తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉషాకిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎంపీపీ ఈదర రాధిక అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు.